గృహలక్ష్మి

శ్రీమతి
తిత్తి శ్రీనివాసినీదుర్గారావు

ఆవేళ సుబ్బులక్ష్మికి లేవగానే, మొట్టమొదట కాఫీ పొడరు, పంచదార లేవనే సంగతి జ్ఞప్తికి వచ్చింది.

రాత్రి ప్రకృతి ప్రసాదించిన వెన్నెల చిక్కదనంలో, చుక్కకన్నెల తళుకుబెళుకు చూపుల్లో ప్రియుని మధుర హస్తముల్లో ప్రాపంచక బాధలన్నీ మరచి నిదురపోయింది. తెల్లవారగానే, అవన్నీ చీకట్లో కలసిపోయాయి. మళ్లీ నిత్యజీవనానికి కావలసిన సంభారములకై వెతుక్కోవాలి.

పేదలకూ, ప్రేమజీవులకూ ప్రసాదించిన అమృతపు గుళిక చక్కని రాత్రేకదా! ఎంతధనమిచ్చినా ధనవంతులకు సహితం దొరకని అమూల్యమైన చల్లని వెన్నెలని, చక్కనైన చంద్రుడిన్ని ప్రసాదించి, అలసిపోయిన పేదల హృదయాల్ని సేదదీర్చిన భగవంతుడిన్ని అందుకేగాబోలు కవులు చిత్రాలు కొద్దీ వర్ణిస్తారు!

కలతలులేని మనసుతో, సాగర సంగీతమే మధుర గానముగా ఆలకించి హాయిగా నిదురపోయిన సుబ్బులక్ష్మికి సూర్యోదయపు వేడికాంతి భరింపరానిదిగ నున్నది.

మళ్లీ ఎవరిని అప్పు అడగాలి? ఆనందరావుని ఎప్పుడూ దేని విషయమై కూడా ఆమె ఇబ్బంది పెట్టలేదు. తన ఆనందమే ఆనందరావు అన్నసిద్ధాంతములో వున్న సుబ్బులక్ష్మికి యీ ఆర్థికపు చిక్కులు కొంత కలచివేచినవి.

సంసారంలో ఏదిలేకపోయినా క్షణం గడవదు. విద్యాధికుడైన భర్త, వుద్యోగం కోసం పడరాని పాట్లు పడటం తాను చూస్తున్నది. కాని ఆనందరావు మనస్తత్వమేవేరు, ఇంట్లో ఏదివున్నదో లేదో అవన్నీ ఆయనకు అవసరంలేదు. ఏవో పైప్రయత్నాలు చేస్తాడు, ఇంట్లో చిల్లర విషయాల సంగతి పట్టించుకోడు.

సుబ్బులక్ష్మిని చూడగానే ఏవో రాజకీయాలు సాహిత్య సమీక్షలతో కాలం గడిపి ఆనందిస్తాడు. సుబ్బులక్ష్మికూడా ఇంటివిషయాల్ని సాధ్యమైనంత వరకు భర్తచెంతకు రానిచ్చేదికాదు.

ఎల్లకాలం యిలాంటి షెల్లీ షెల్లీ షైక్స్‌పియర్ల గోష్ఠితో కడుపు నిండుతుందా? సంసార యాత్ర వుదయం మొదలు పెట్టగానే నేటి ప్రజాసమూహానికి కాఫీ దేవత ముందు ప్రత్యక్షమవాలి; లేకపోతే కాళ్లూ చేతులూ ఆడవు.

ఆలాగే, ఆనందరావు సుబ్బులక్ష్మి సంసారంలో కూడా, ఏవో పెట్టె అడుగున మిగిలిన చిల్లరతో కొద్దిగా పంచదార, పాలూ కాఫీపొడరు యేర్పాటై ప్రాతఃకాలం గడచింది. మరి మధ్యాహ్నపు సరంజామో!

సుబ్బులక్ష్మి సహించలేక పోయింది. ఎంతసహనశీలకైనా ఒక్కొక్కప్పుడు, ఆవేశం పుట్టుకొస్తుంది.

మెల్లగా ఆనందరావు వ్రాసుకుంటున్న టేబిల్ వద్దకువెళ్లి, ఏమిటి మాట్లాడాలో, ఏమని భర్తకు చెప్పాలో అర్థంగాక నిలబడి పోయింది.

మనస్సులో పరిపరి విధాల వూహలు తిరుగుతున్నాయి. ఏమీ పట్టించుకోకుండా కూర్చున్న భర్తపై అంతకంతకూ చిరుకోపం వస్తున్నది.

ఇట్లా తనవలెనే యింట్లో కూర్చుంటే జీవితమెలాగు సాగుతుంది? జీవితం ఎట్లా గడుస్తుంది? ఏదో ఆలోచించాలిగాని పురుషప్రయత్నం లేకుండా అంతా దైవయత్నం అని వూరుకుంటే రేపటి సంగతి ఏమాతుంది?

సుబ్బులక్ష్మి ఆలోచనల్లో వుక్కిరి బిక్కిరై, "మీరిలా కూర్చుంటే రేపుకు కాఫీ, ఫలహారాలు, భోజనం ఎలావస్తాయండీ?" అని పోరపాన్ని యిరికించి అంది.

ఆనందరావు తలెత్తిచూసాడు. "సుబ్బూ! ప్రపంచంలోని అన్యులవలనే నీవుకూడా నన్ను నిందిస్తున్నావా?" ఆనందరావు గొంతుకలో మాట్లాడాడు. "మరి, ఏంచేయమంటావ్, చెప్పు! ఏదో విద్యాధికుడి ననిపించుకొని యెం. యే. వరకూ చదువు వెలగబెట్టి చివరకు మాన ప్రాణాలను అమ్ముకొనే గుమాస్తాగిరీ చేయలేను. పోనీ, నాకు కాఫీ ఫలహారాలు వద్దులే!" మెల్లగా అన్నాడు.

సుబ్బులక్ష్మికి ఏమీతోచలేదు.

"మీరు మానేస్తే తక్కిన వాళ్లంతా వస్తుండా లన్నమాట! నామాటకేమి, ప్రేమూలేస్తే పాలకు ఏడుస్తుంది.' పసిపిల్ల, దానికి యీ ఆర్థికపు సమస్యలేవీ తెలియవుకదా! ఏదోగత్యంతరం ఆలోచించాలిగాని అలా కూర్చుంటే యీపుస్తకాలవల్ల కడుపు నిండుతుందా?"

సుబ్బులక్ష్మి మాటలకు వుత్తేజితుడైన ఆనందరావు వెంటనే కండువా భుజం మీద వేసుకొని బయల్దేరాడు. వెళ్తున్న ఆనందరావుని చూస్తూ సుబ్బులక్ష్మి అక్కడే నిల్చుండిపోయింది. ఎన్నడూ లేనిది భర్తను నొప్పించావనే విచారంతో మనస్సు క్రుంగిపోయింది.

"ఏమనుకున్నారో ఏమో, ఎండలో, ఎక్కడికి బయల్దేరారో తెలియదు. కోపం వచ్చిందేమో, లేక ఎవరినైన బదులడగటానికి వెళ్లారో ..."

ఆలోచనలో మునిగిన సుబ్బులక్ష్మికి చిన్నపాపాయి ప్రేమూ ఏడుపు వినిపించింది. గబగబా యింట్లోకి వెళ్లిపోయింది.

సాయంత్రం అయిదు అయిపోయింది. ప్రొద్దుట నుండి పనిలో అలసిపోయిన జనం యిళ్లకు వెళ్లిపోతున్నారు. విలాసజీవులు విహారానికి బయల్దేరుతున్నారు. అప్పుడే చండకిరణుడుకూడా తన ప్రతాపాన్ని చాలించి గృహోన్ముఖుడౌతున్నాడు. ఆఫీసు గుమాస్తాలు వడివడిగా బారులు తీస్తున్నారు.

ఇల్లు, యిల్లాలు వుండికూడా ఆనందరావు యింట్లికి వెళ్లలేక దిగులుగా పార్కులో కూచొని నూన్యాకాశం వైపు తిలకిస్తున్నాడు. ఎంతోమంది స్నేహితుల్ని కలుసుకున్నాడు. ఆర్థిక సహాయాన్ని అర్థించాడు, లాభంలేకపోయింది. కొంతసేపు లైబ్రేరీలో గడిపి మనశ్శాంతిని కల్పించుకొని, తన సమస్యను పరిష్కరించే యేగ్రంగమూ పనికిరాకపోగా, చేసేది లేక పార్కుకి వచ్చాడు.

ఆనందరావు మనస్సు యింటిముఖం పట్టసాగింది. ఎన్నోకష్టాల్ని ఎదుర్కున్నాడు. అన్నిటిలోనూ సుబ్బులక్ష్మి ప్రసన్నవదనంలో చల్లని మాటలతో వుపశమనం పొందేవాడు. ఏదో స్త్రీ సహజమైన ఆవేశంతో ఏవేవో అన్నదని తాను మగవాడై వుండీ కూడా అలిగి కూర్చున్నాడు, తన అవివేకానికి తనకే నవ్వొచ్చింది.

తను యెం. యే. చదువుకున్నా సుబ్బులక్ష్మి లౌకిక జ్ఞానమే అవసరానికి పనికి వస్తుందేమో ననిపించింది.

వెంటనే ఆనందరావు యింటికి బయల్దేరాడు. సుబ్బులక్ష్మి కిటికీవద్దనే కూచుని ఎదురు చూస్తున్నది.

నీరసంగా కూర్చున్న సుబ్బులక్ష్మికి ఆనందరావు కనబడగానే ఎంతో బలం వచ్చినట్లయింది.

"సుబ్బూ! అలావున్నావేం, భోజనం చెయ్యలేదా? అవునుకదూ, యింట్లో ఏమీలేవు. కాఫీ అయినా త్రాగావా" అంటూ ఆనందరావు యింట్లో ప్రవేసిస్తూనే అడిగాడు.

ప్రేమూవచ్చి ఆనందరావు రెండుకాళ్లూ పట్టుకొని అమాయకంగా ముఖంలోకి చూసింది.

సుబ్బులక్ష్మి రెండుకప్పుల్లో కాఫీ తెచ్చి బల్లపై పెట్టింది. ఆమెకళ్లు రెండూ నీళ్లతో నిండినై.

"ముఖం కడుక్కోండి, ఆనక కాఫీపుచ్చుకో వచ్చు. ప్రొద్దుట నుండి తిరిగి తిరిగి అలసినట్లున్నారు. ఏమన్నానని అలా అలిగి వెళ్లిపోయారు? మీరొచ్చిన వరకూ నాకేమీ తోచనేలేదు. వేగం లేవండిమరి."

గృహలక్ష్మి

ఆనందరావు ముఖం కడుక్కొనివచ్చి కాఫీ ముందుకూర్చున్నాడు. "సుబ్బా, నీవూరా" అని పిల్చేడు. ప్రేమూవచ్చి యిద్దరిమధ్యయిరికింది.

"చూడండి, ప్రేముకి ఏ ఆందోళనలూ, బాధలూ లేవుకదా! మనం కూడా యిలావుండవేం" అంది సుబ్బులక్ష్మి.

"ఏం, ఎందుకు వుండలేం, నేనుమాత్రం నిన్ను చూస్తూ వుండగలను." సుబ్బులక్ష్మి సిగ్గుతెచ్చుకొని "నేనూ అంతే" అంది. ఒకరి ముఖాలొకరు చూసుకొని నవ్వుకున్నారు పిల్లల్లాగ. వాళ్లనుచూస్తూ ప్రేమూకూడా నవ్వుకలిపింది.

"మీరలా గాభరా పడ్డారుగాని వెంటనే డబ్బు ఎలా దొరికిపోయిందో, చెప్పండి! ఇదిగో యీ వుంగరం వొకటి మిగిలింది. ప్రస్తుతానికి పనికొస్తుందిగా, ఇది మార్చి సొమ్ము చెయ్యండి, ఆతర్వాత సంగతి ఆలోచిద్దాం."

ఆనందరావు మాట్లాడలేదు.

"ఊఁ! వెళ్లిరండి. ఉన్నకొలది చీకటిపడిపోతున్నది. ప్రేమూకి పాలూ, వంటకి సరంజామా అవీ తీసుకురండి" అని సుబ్బులక్ష్మి తొందరచేసింది.

ఆనందరావు సుబ్బులక్ష్మి చేతులు పట్టుకొని కళ్లల్లోకి చూశాడేగాని మాట్లాడలేకపోయాడు.

"పర్వాలేదు, వెళ్లిరండి. ప్రతిస్త్రీ కర్తవ్యం కూడా ఇదే" అంటూ భర్తను ప్రోత్సహించింది.

ఆనందరావు బజార్లో నడుస్తున్నాడేగాని దృష్టంతా జేబులోవున్న వుంగరం మీదనే వుంది. ఎంతోవుపద్రవంవచ్చి కూర్చుంటేనేగాని స్త్రీలు ఆభరణాల్ని మగాళ్ల చేతుల్లో పెట్టరు; అందులోను పెళ్ళినాటి ప్రేమచిహ్నాలు!

ఆనందరావుకు షావుకారు శీతారామయ్య కొట్లో కనిపించాడు.

ఎంతటివారికైనా వస్తువులు విక్రయించటమంటే అవమానంగానే వుంటుంది. అటువంటప్పుడు సానుభూతికోసం ఆప్తుల్ని ఆసరా అడగటం సహజం!

షావుకారు శీతారామయ్య పైవాడుకాదు. ఆనందరావు తండ్రి ఆదరణతో చిల్లరకొట్టును బంగారం కొట్టుగా చేసుకున్న శీతారామయ్య ఆనందరావును బాగా ఎరుగును. పైగా అతని కొడుకు సుబ్బారావు ఆనందరావుతో చిన్నప్పుడు చదువుకున్నాడు.

సరస్వతీకటాక్షం కలిగిన ఆనందరావు లక్ష్మీకటాక్షం కలిగిన సుబ్బారావు యిప్పుడు వేర్వేరు భవంతుల్లో మెలగటంలో వింతేమున్నది?

ఆనందరావు శీతారామయ్య కొట్లోకి వెళ్లాడు. ఆనందరావును చూడగానే గుర్తుపట్టిన శీతారామయ్య ఆప్యాయంతో ఆహ్వానించాడు.

"ఏం బాబూ, ఇలావచ్చావ్. అంతా కులాసాయేనా? పెద్దవాడవయ్యావు పిల్లలా?"

"అవును, బాబాయ్! అవసరం వుండి వచ్చాను. యింట్లో మీ కోడలూ, చిన్నపాపాయి బాగానేవున్నారని" ఆనందరావు జవాబిచ్చాడు.

"అవును నాయినా! అవసరం లేందే మావంటి చదువురాని వాళ్లదగ్గర మీబోటి చదువుకున్న వాళ్లకేంపని? ఏంపని చేస్తున్నావ్, బాబూ!" శీతారామయ్య ఆప్యాయంగా అన్నాడు.

"లేదు బాబాయ్. ఈరోజుల్లో మాచదువులు పొట్టగడవటానికే పనికిరాకుండా వున్నాయి. ఏదో గాలిలో మేడలే కాని మీలాగ భవంతుల్నికట్టలేం."

శీతారామయ్య గట్టిగా నవ్వాడు.

"బాగా చెప్పావు బాబూ! మావాడు కూడా గాలిలో మేడలు కట్టడానికి చూస్తున్నాడు. ఏదో యీ వ్యాపారం చూసుకోరా అంటే అక్కర్లేదట. ఏవో పత్రికలని, పుస్తకాలని - తనూ ఏదో పత్రిక పెట్టాలని, ఆవిధంగా మా వైశ్యకులాన్ని వుద్ధరిస్తానని చెప్తుంటాడు. మాలోకూడా సారస్వతాభిమానులున్నారని దేశానికి చాటుతాడట. యికమిగిలింది సమర్థుడైన సంపాదకుని కోసం వెతకటమే!"

"బాబాయ్! నిజంగా మీవంటి వారే ఏసంస్థనైనా నిలబెట్టగలరు. మావంటి 'మనోప్రపంచం'

వాళ్లం గాలిలో విహరించటమేగాని డబ్బుపట్టుకొని ఏపనీ చేయలేముకదా! మీవంటి పుష్కలస్తంభాలు నిలబడితేనేకదా దానిమీద మాలాంటి వాళ్లం సాహిత్యసౌధాలు కట్టగలం!"

"ఆనందం నీవూ సమయానికే వచ్చావు. రేపే మా సుబ్బారావుతో చెప్పి నిన్ను సంపాదకునిగా నియమిస్తాను. ఏం, నీకిష్టమేనా?"

ఆనందరావు ఆశ్చర్యపోయాడు.

శీతారామయ్యా ముఖంలో ఆదరణ మాత్రం తొణికిసలాడుతోంది.

"అలాగే బాబాయ్, మీరలాగంటే నేను కాదంటానా" ఆనందరావు జవాబిస్తుండగా వొళ్ళంతా గగుర్పొడిచినట్టయింది.

కాని సుబ్బులక్ష్మి వుంగరం జ్ఞప్తికొచ్చింది. ఉంగరాన్ని వదలలేక గట్టిగా పట్టుకున్నాడు.

ఆనందం అవస్థను శీతారామయ్య కనుక్కోగలిగేడు. "బాబూ, ఏమైనాసొమ్ము అవసరమా?" శీతారామయ్య మొదటి వాత్సల్యంతో అడిగాడు.

ఆనందరావు సిగ్గుపడిపోయాడు.

"అవును, బాబాయ్! యీవుంగరం వుంచి కొంతయివ్వండి. టైమయింది. యింట్లో మీకోడలు కనిపెట్టుకుంటుంది."

శీతారామయ్య వుంగరాన్ని పరీక్షగా చూశాడు. మూడు ఎర్రటి కెంపులు పొందుగా వున్నాయి. వెయ్యిగట్టి పరాబులకు మించిన శీతారామయ్య మెదడు ఆవుంగరం విలువను కట్టలేకపోయింది.

ముసలాడిహృదయం ద్రవించింది. "నాయనా! యీవుంగరాన్ని నేను బహుమతిగా యిచ్చానని కోడలికి యిచ్చెయ్. ఇదిగో యీ నూరూ అడ్వాన్సుగా నీవు తీసుకో" అంటూ శీతారామయ్య పది నోట్లుతీసి ఆనందరావు కిచ్చాడు.

ఆనందరావు ఆనందానికి అంతులేకపోయింది. "రేపు సుబ్బారావుతో మాట్లాడు. జీతం హెచ్చులోనే వుంటుందిలే. యీనూరూ అడ్వాన్సు అనుకో."

ఆనందరావు రెండు చేతులూ అప్రయత్నంగా కలిసాయి. మనస్సులో శీతారామయ్యకు కృతజ్ఞత తెల్పాడు.

నిండుమనస్సుతో ఆనందరావు యింటికి బయల్దేరాడు. మిఠాయి, పూలు, పాలూ కొన్నాడు. వంట ఆలస్యమౌతుందని కేరియరు ఆర్డరిచ్చి యింటిముఖం పట్టాడు.

శుక్లపక్షపు త్రయోదశి చంద్రుడు తనతో కూడా నడుస్తున్నాడు. గాలికంటే వేగంగా మనస్సు యింటికి పరుగెత్తింది.

సుబ్బులక్ష్మి ఆనందరావు అట్టహాసాన్ని చూసి వుంగరం అమ్మి యివన్నీ ఎందుకని అనుకుందిగాని భర్తనేమీ అడగలేదు.

మిఠాయి పొట్లాం విప్పి తలోక వుండా నోట్లో వేసుకున్నారు. ఎందుకీ అట్టహాసం అన్నట్లు సుబ్బలక్ష్మి కళ్లు నివ్వెరపాటు చెందాయి.

"మేలు చేసినవారికి మిఠాయి బహూకరించమని పెద్దలు చెప్తారు కాబట్టే నీకీ మిఠాయి."

"బాగుందండీ! నేనేం మేలుచేసానని. అయినా మీరు ప్రేమ ప్రసాదిస్తే అందుకు ప్రతిఫలంగా యీప్రేమా ..."

ఇద్దరకూ ఒకేసారి నవ్వు పెదాలమీద విరుచుకుంది.

వారి మాటలకు అర్థం తెలీక చిన్నప్రేమా నవ్వుతూ చప్పట్లు చరిచింది.

"ఆ! వంటసరంజామా ఏదీ? మరి భోజనం వద్దా?"

"ఎందుకొద్దూ, అదిగో ఆకేరియర్ లో మనకోసమే చూస్తోంది. రా, భోంచేద్దాం."

ప్రేమాకి పాలుపట్టి, నిద్దురపుచ్చడానికి సుబ్బలక్ష్మి రెండు జోలపాటలైనా పాడవలసి వచ్చింది.

ఆనందంతో ఆనందరావు కూడా కూనిరాగం తీసాడు.

"సరే, ముందు భోజనం కానివ్వండి. తర్వాత తిరిగ్గా పాడుదురు గాని."

ఆనందరావు నవ్వు ఆపలేదు. సుబ్బులక్ష్మికి అర్థం కాలేదు. దంపతులిద్దరూ భోజనానికి కూర్చున్నారు.

"సుబ్బూ! నేచెప్పలే, నీవే నా ఆనందలక్ష్మివని. నీవిచ్చిన ఆవుంగరం వలననే నాకు ఎక్కడలేని ఆనందం కల్గుతోంది."

సుబ్బులక్ష్మికి కోపం వచ్చింది.

"ఉంగరం యిచ్చినందుకు మీరు అమ్మినందుకేనా ఆనందం నాకీపొగడ్తాను?"

ఆనందరావు నవ్వుతూ కూచున్నాడు.

"అవును, మీరునన్న వెక్కిరిస్తున్నారు. ప్రాణ తుల్యమైన ఉంగరం యిచ్చానుకదూ, ఎం, యివ్వకూడదా? నేనేం ప్రాణాన్ని దానం పోసానని మీరు నన్ను పొగడడానికి."

"కాదుమరీ, ఆవుంగరమే నన్నీస్థితికి తీసుకొచ్చిందంటే నీవునమ్మవు. మరిసంగతి వింటావా?"

సుబ్బులక్ష్మి ఆయోమయంగా కళ్లు నిలబెట్టి 'సరే' అన్నట్టు భర్తకళ్ళలోకి చూసింది.

"రేపటినుంచి నేనొక పత్రికా సంపాదకుడను తెలుసా, అదంతా నీవుంగరం వలనే."

సుబ్బులక్ష్మి ఆశ్చర్యపోయింది.

భోజనాలయ్యాక ఆనందరావు జరిగిందంతా సుబ్బులక్ష్మితో చెప్పాడు. తిరిగి వుంగరాన్ని సుబ్బలక్ష్మి చిటికిన వ్రేలికి అలంకరించాడు.

వికసించిన తామరపూవువంటి ఆమె ముఖాన్ని ఆనందరావు తన రెండు చేతుల్లో పైకెత్తి ఆమె కళ్ళల్లోకి చూస్తూ "సుబ్బూ, నీవు నా ఆనంద లక్ష్మివేకదూ ..." అని సూటిగా అడిగాడు.

అవ్యక్త మధుర తంత్రులు మీటినట్లయింది సుబ్బులక్ష్మికి. ఎదురుగనున్న ఆనందరావు ఆనందముకన్నా కావలసిందేముంది సుబ్బులక్ష్మికి, ఆగృహలక్ష్మికి?

పాతురిడుగారి

బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 85254.

కుంభకోణము బ్రాంచి :	తిరుచినాపల్లి బ్రాంచి :
1. సారంగపాణి కోవిల, తూర్పువీధి.	15 పుగళియపిళ్లెవీధి, తెప్పకుళం. P. O.

అన్ని మందుల షాపులలోను దొరకును.